వైభవంగా స్వామివారికి అభిషేకం.. నేడు చేవెళ్లలో రథోత్సవం

చేవెళ్ల, ఫిబ్రవరి 8 : చేవెళ్ల శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. రథోత్సవంలో భాగంగా గురువారం దేవాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి అర్చన, అభిషేకం, పల్లకీ సేవతో పాటు రాత్రి గరుడసేవలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్తలు శ్రీకాంతాచారి, శ్రీపాదు, ఈవో నరేందర్, భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం స్వామివారి రథోత్సవం కనుల పండుగా నిర్వహించనున్నారు. స్వామివారు సంప్రదాయ బద్ధంగా కట్టెల రథంపై ఊరేగుతారని దేవాలయం ధర్మకర్తలు తెలిపారు.

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డికి

షోకాజ్ నోటీసులు

జారీ చేసిన కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

చేవెళ్ల, ఫిబ్రవరి 8 : అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన నాయకులపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చర్య చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆదేశాలను విస్మరించిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన వారం రోజుల్లోగా సమాధానం చెప్పాలని నోటీసులో పేర్కొన్నారు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి పాల్పడిన విషయాలపై తమవద్ద ఆధారాలు ఉన్నాయని అందులో పేర్కొన్నారు. అయితే చేవెళ్ల నియోజకవర్గంలో మధుసూదన్‌రెడ్డికి క్రమశిక్షణ కమిటీ నుంచి నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ నాయకుల్లో జోరుగా చర్చ సాగుతోంది. పార్టీ అధిష్టానానికి వివరణ ఇచ్చా : మధుసూదన్‌రెడ్డి పార్టీ అధిష్టానం తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసులపై పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డికి ఇటీవలనే సమాధానం ఇచ్చామని షోకాజ్ నోటీసులు అందుకున్న టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం



మధుసూదన్‌రెడ్డి

ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. తనపై కొందరు నాయకులు లేనిపోని రాజకీయ ఆరోపణలు చేశారన్నారు. అందుకే చిన్నారెడ్డి తనకు నోటీసులు జారీ చేశారని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం కోసం నిరంతరం శ్రమించిన నాయకుల్లో మొదటి వరుసలో తానే ఉంటానన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇతర పార్టీ నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్పించాలనని, పార్టీ ఆదేశించిన ఏ కార్యక్రమం అయిన విజయవంతంగా ముందుండి నడిపించామని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన సొంత గ్రామంతో పాటు షాబాద్ మండలంలో కూడా కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ఓట్లు వచ్చాయన్నారు. కొందరు నాయకులు తన ఎదుగుదలను చూసి కావాలనే తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



తిండి కోసం కొంగల తంటా

ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కురియకపోవడంతో ఏ గ్రామంలోనూ చెరువులు, కుంటలు నిండలేదు. దాంతో కొంగలకు ఆహారం కొరత వేధిస్తుంది. దాంతో ఎక్కడ పొలాలు దున్నితే అక్కడ గుంపులు గుంపులుగా వాలి ఆహారం కోసం తంటాలు పడుతున్నాయి. వరి పొలాల్లో పురుగుల కోసం వేటాడుతూ దర్శనమిస్తున్నాయి. యాచారం మండలం చిన్నతూండ్ల గ్రామంలో గురువారం వరినాట్ల కోసం ఓ రైతు పొలం దున్నుతుంటే ఇదిగో కొంగల గుంపు ఇలా వాలి పురుగులను వేటాడి తమ కడుపు నింపుకుంటున్నాయి.

- యాచారం, ఫిబ్రవరి 8 :

ఉమ్మడి రంగారెడ్డి రాజకీయాల్లో భారీ కుదుపునకు తెరలేచింది. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, తన సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం రాజకీయ వర్గాల్లో కలకలం లేపింది. వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న విషయం తెలియడంతో బీఆర్ఎస్ నాయకులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఈ పరిణామాలు బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బగానే పరిగణించాలని రాజకీయ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కాంగ్రెస్ గూటికి పట్నం దంపతులు

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేందర్‌రెడ్డి కుటుంబం

- ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్
- చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థినిగా సునీతారెడ్డి!
- మహేందర్ బాటలో మరికొందరు ఎమ్మెల్యేలు!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంచి పట్టున్న మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడం బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బేనని చెప్పాలి. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు బీఆర్ఎస్ తాండూరు టికెట్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్ వైపు చూశారు. పలు దఫాలు ఆయన పార్టీ ముఖ్య నేతలతో చర్చలు కూడా జరిపారు. అయితే, ఇది గమనించిన బీఆర్ఎస్ నాయకత్వం ఎన్నికలకు ముందు ఆయనకు మంత్రి పదవి ఇచ్చి బుజ్జగించింది. దీంతో ఆయన పార్టీ మారే యోచనను విరమించుకున్నారు. కానీ మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు కానీ, ఆయన ముఖ్య అనుచరులకు కానీ మహేందర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం నచ్చలేదు. ఈ కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు మహేందర్‌రెడ్డితో వారు కలిసి రాలేదు. ముఖ్యంగా ఆయన భార్య సునీతారెడ్డి కూడా ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. మహేందర్‌రెడ్డిని ఎలాగైనా కాంగ్రెస్‌లోకి రప్పించాలని రేవంత్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. ఎన్నికల తేదీకి వారం రోజుల ముందు కూడా ఆయనకు భారీ ఆఫర్ ఇచ్చారు. కానీ, అప్పటి పరిస్థితుల్లో ఆయన బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని నిర్ణయించారు. ఎన్నికల ఫలితాల తరువాత కూడా మహేందర్‌రెడ్డిని రప్పించేందుకు కాంగ్రెస్ నేతలు పలుమార్లు చర్చలు జరిపారు. చివరకు మహేందర్‌రెడ్డి ఆయన భార్య సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించారు. ఇదిలా ఉంటే మహేందర్‌రెడ్డి కుటుంబం చేరిక వెనుక బలమైన కారణమే ఉంది. మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి చేవెళ్ల పార్లమెంట్ సీటు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ మేరకు వారి కుటుంబానికి స్పష్టమైన హామీ కూడా లభించడంతో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి బలమైన అభ్యర్థులు బరిలోకి దిగుతుండడంతో అధికార కాంగ్రెస్ కూడా ఆర్థిక, అంగబలం ఉన్న వారిని పోటీలో దింపే యత్నం చేస్తోంది. మహేందర్‌రెడ్డి సతీమణి సునీతారెడ్డి గతంలో ఉమ్మడి రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా పదేళ్ల పాటు పనిచేయడంతో ఆమెకు జిల్లా అంతటా సన్నిహిత సంబంధాలున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ సునీతారెడ్డిని బరిలో దింపాలని నిర్ణయించినట్లు సమాచారం. మహేందర్‌రెడ్డి కుటుంబంతో పాటు ఆయన అనుచరులు ఈ నెల 11వ తేదీలోగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

మల్కాజిగిరిపై తర్జనభర్జన

ఇదిలా ఉంటే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి కూడా కాంగ్రెస్‌లో పోటీ ఉన్నప్పటికీ ఆర్థికంగా బలంగా ఉన్న వారి కోసం కాంగ్రెస్ ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. మల్కాజిగిరి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన మైనంపల్లి హన్మంతరావు కూడా పోటీకి సై అంటున్నట్లు సమాచారం. అలాగే సీనియర్ నేత కుసుమ కుమార్‌తో పాటు హరివర్ధన్‌రెడ్డి తదితరులు ఆసక్తిగా ఉన్నారు. అయితే ప్రధానంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పేరు కూడా కొద్ది రోజులుగా వినిపిస్తోంది. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇప్పటి వరకు ఎవరికీ హామీ ఇవ్వలేదు. ఇపుడు చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో సీఎం మదిలో ఏముందో ఎవరికీ తెలియడం లేదు.

ఎమ్మెల్యేలపై గురి!

పార్లమెంట్ ఎన్నికలకు ముందు వలసలకు గేట్లు తెరవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యంగా నగర శివార్లలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పూర్తిగా తమ వైపునకు తిప్పుకునేందుకు ఇప్పటికే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డికి టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన టీఆర్ఎస్‌తో అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. ఇక మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇటీవల తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ కలకలం రేకెత్తించాయి. త్వరలో తాను కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని, తన నియోజకవర్గంలోని కీసర ఆలయానికి రావాలని ఆహ్వానిస్తానని చెప్పారు. తాజాగా మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు సీఎంను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. మహేందర్‌రెడ్డితో పాటు నగర శివార్లలోని మరి కొందరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నెల 11వ తేదీలోగా బీఆర్ఎస్‌లో భారీ కుదుపులు ఉంటాయనే ప్రచారం సాగుతోంది.

నేడు ఆదిభట్ల మున్సిపల్‌లో



అవిశ్వాస ఓటింగ్

- ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన కలెక్టర్
- సర్వత్రా ఉత్కంఠ

ఆదిభట్ల, ఫిబ్రవరి 8: ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆర్థికపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం ఓటింగ్ జరగనుంది. మున్సిపాలిటీలో మొత్తం 15మంది కౌనిలర్లు ఉండగా అందులో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ మినహా మిగతా 13మంది వీరికి వ్యతిరేకంగా ఉన్నారు. వీరంతా ఇప్పటికే క్యాంపులో ఉన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులకుగాను ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 8, బీఆర్ఎస్ 6 వార్డులు బీజేపీ ఒక వార్డును గెలుచుకున్నాయి. కాంగ్రెస్ పార్టీకి బీజేపీ మద్దతు ఇవ్వడంతో వారి సంఖ్య 9కి చేరింది. దీంతో చైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్‌కు చెందిన ఆర్థిక దక్కించుకున్నారు. వైస్ చైర్‌పర్సన్ పదవిని మాత్రం ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతుతో బీఆర్ఎస్‌కు చెందిన కోరె కళమ్మ కైవసం చేసుకున్నారు. అయితే, పాలనలో చైర్‌పర్సన్ కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువైందన్న కారణంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు వీరిపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు.



చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక

పార్టీ మారినా మారని తీరు..

కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ మధ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. అయినా, పాలనలో ఆమె కుటుంబ సభ్యుల పెత్తనం ఎక్కువైందన్న కారణంతో ఆమెకు ఆ పార్టీకి చెందిన సభ్యులు సహకరించడం మానేశారు. దీంతో ఆమె తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే, ఇక్కడ కూడా ఆమెకు సహకారం అందలేదు. దీనికి తోడు పీసీసీ సభ్యుడు, కౌన్సిలర్ మర్రి నిరంజన్ రెడ్డి రంగంలోకి దిగి కాంగ్రెస్ సభ్యులతో పాటు బీఆర్ఎస్, బీజేపీ సభ్యులతో అవిశ్వాస తీర్మానం కోసం కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. కలెక్టర్ ఎన్నికల అధికారిగా ఆర్డీఓ అనంతరెడ్డిని నియమిస్తూ ఈ నెల 9న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిరంజన్ రెడ్డి మొత్తం 13మంది సభ్యులతో క్యాంపు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం క్యాంపులో ఉన్న వారిలో కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు, బీజేపీకి చెందిన ఒకరున్నారు. అయితే, క్యాంపు రాజకీయాలకు తెరతీసిన కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ మర్రి నిరంజన్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేశారు. నిరంజన్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయడంతో పాటు క్యాంపులో ఉన్న వారు బయటకు వచ్చి పార్టీ సూచించిన వ్యక్తికి మద్దతు తెలపాలని, లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే, దీనిపై కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఎవరూ స్పందించలేదు. దీంతో నేడు జరిగే అవిశ్వాస తీర్మానం ఓటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ప్లస్ గ్రేడ్

షాద్‌నగర్, ఫిబ్రవరి 8 : షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి ప్రయత్నంలోనే న్యాక్ బి ప్లస్ గ్రేడ్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ నిపుణుల బృందం గత నెల 30, 31వ తేదీల్లో కళాశాలను సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించిందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోనే మొదటి సారిగా బి ప్లస్ గ్రేడ్ సాధించి డిగ్రీ కళాశాల చరిత్ర సృష్టించిందన్నారు. డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళాశాలలో మౌలిక వసతుల ఏర్పాట్లు చేశారన్నారు. ఈ గ్రేడ్ సాధించడానికి కీలకంగా వ్యవహరించిన బోధన, బోధనేతర సిబ్బంది, స్టడీ రిపోర్ట్‌ను రూపొందించిన ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలతను ఆమె అభినందించారు. మొదటి ప్రయత్నంలోనే ఈ విజయాన్ని సాధించిన ఈ కళాశాలలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడానికి, యూజీసీ నిధులు సాధించడానికి మార్గం ఏర్పడిందన్నారు.



షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

అత్యల్ప ఓటర్లు షాద్‌నగర్ అసెంబ్లీలోనే..

జిల్లాలో అత్యల్ప ఓటర్ల సంఖ్య షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనే ఉన్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 252 పోలింగ్ కేంద్రాల్లో 2,38,392మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,22,805 ఉండగా, మహిళా ఓటర్లు 1,20,148మంది ఉన్నారు. అలాగే ఇతర ఓటర్లు తొమ్మిదిమంది ఉన్నారు.



35,91,987 జిల్లా ఓటర్లు..

తుది ఓటరు జాబితా విడుదల

- పెరిగిన ఓటర్లు 68,768
- అత్యధికంగా శేరిలింగంపల్లిలో 7,47,757 ఓటర్లు
- అత్యల్పంగా షాద్‌నగర్ అసెంబ్లీ పరిధిలో 2,38,392 ఓటర్లు

రంగారెడ్డి అర్బన్, జనవరి 8 : పార్లమెంట్ ఎన్నికలకు ఈసీ కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికల సంఘం గురువారం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసింది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3,369 పోలింగ్ కేంద్రాల్లో 35,91,987 ఓటర్లు ఉన్నారని ఈసీ పేర్కొంది. ఈ నెల 6న ముసాయిదా జాబితాను రూపొందించారు. 22వ తేదీ వరకు క్లైమ్స్, అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యంతరాలతో పాటు ఓటరు నమోదు, తొలగింపు, సవరణలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన వాటిని బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. డబుల్ ఎంట్రీ, బోగస్ పేర్లు లేకుండా జాబితాను బీఎల్‌వో మొదలుకుని ఈఆర్‌వో స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటరు జాబితా పక్కాగా, పూర్తి పారదర్శకంగా రూపొందేలా అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ జరిపారు. జాబితాలో రెండేసి పేర్లుంటే గుర్తించి, నోటీసులు జారీ చేసి విచారణ జరిపి తొలించారు. పేర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించి విస్తృత ప్రచారం నిర్వహించారు. 18 సంవత్సరాల వయస్సు కలిగిన యువత తప్పనిసరిగా ఓటరు పేరు నమోదు చేసుకునేలా చొరవ తీసుకున్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. చివరకు ఓటరు తుది జాబితాలో పొరపాట్లకు ఆస్కారం ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని పారదర్శకంగా ఉండేలా రూపొందించారు.

భారీగా పెరిగిన ఓటర్లు

2023 నవంబరులో విడుదలైన తుది ఓటరు జాబితా ప్రకారం 35,23,219 ఓటర్లు ఉండగా ప్రస్తుతం విడుదలైన తుది జాబితా ప్రకారం జిల్లాలో 35,91,987మంది ఓటర్లున్నారు. గత ఓటరు తుది జాబితాకు ప్రస్తుతం జాబితాను పరిశీలిస్తే జిల్లాలో 68,768 మంది ఓటర్లు పెరిగారు. జిల్లాలో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గం శేరిలింగంపల్లి. తుది జాబితా ప్రకారం ఈ నియోజకవర్గంలో 7,47,757మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 3,95,460మంది, మహిళలు 3,52,069 మంది. ఇతరులు 144మంది ఉన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 7,32,587 ఓటర్లు ఉండగా ప్రస్తుతం ఈ ఓటర్ల సంఖ్య 7,47,757కు చేరుకుంది. గత ఓటరు తుది జాబితాకు ప్రస్తుతం విడుదలైన తుది ఓటరు జాబితాను పరిశీలిస్తే.. ఈ నియోజకవర్గంలో 15,170మంది ఓటర్లు పెరిగారు.

పారదర్శకంగా తుది ఓటరు జాబితా : కలెక్టర్



తుది ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించామని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఎస్ఎస్ఆర్ 2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను తయారు చేసినట్లు చెప్పారు. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 3,369 పోలింగ్ కేంద్రాల్లో 35,91,987మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. తుది జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహసీల్దార్ కార్యాలయాల్లో, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	2023 నవంబర్ 11న విడుదలై ఓటరు జాబితా ప్రకారం	2024 ఫిబ్రవరి 8 ఓటరు జాబితా ప్రకారం	పెరిగిన ఓటర్ల సంఖ్య
ఇబ్రహీంపట్నం	3,27,657	3,37,134	9,477
ఎల్బీనగర్	5,93,774	6,00,552	6,778
మహేశ్వరం	5,46,713	5,56,110	9,397
రాజేంద్రనగర్	5,82,114	5,99,778	17,664
శేరిలింగంపల్లి	7,32,587	7,47,757	15,170
చేవెళ్ల	2,62,084	2,69,166	7,082
కల్వకుర్తి	2,41,898	2,43,098	1,200
షాద్‌నగర్	2,36,392	2,38,392	2,000
మొత్తం	35,23,219	35,91,987	68,768

2024-ఫిబ్రవరి 8న విడుదలైన తుది జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పీఎస్‌లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం	ఎన్ఆర్ఐ ఓటర్లు	సర్వీసు ఓటర్లు	గ్రాండ్ టోటల్
ఇబ్రహీంపట్నం	319	1,69,713	1,67,298	36	3,37,047	32	55	3,37,134
ఎల్బీనగర్	570	3,12,163	2,88,153	134	6,00,450	52	50	6,00,552
మహేశ్వరం	511	2,84,913	2,70,996	69	5,55,978	59	73	5,56,110
రాజేంద్రనగర్	535	3,10,863	2,88,684	38	5,99,585	102	91	5,99,778
శేరిలింగంపల్లి	622	3,95,460	3,52,069	144	7,47,673	34	50	7,47,757
చేవెళ్ల	298	1,35,261	1,33,820	06	2,69,087	05	74	2,69,166
కల్వకుర్తి	262	1,22,805	1,20,148	09	2,42,962	02	134	2,43,098
షాద్‌నగర్	252	1,19,114	1,19,211	13	2,38,338	0	54	2,38,392
మొత్తం	3369	18,50,292	17,40,379	449	3,59,1120	286	581	35,91,987

రైల్వే అండర్ పాస్ రాకపోకలు షురూ

● అసంపూర్తి పనులు పూర్తి
● పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8: నాలుగు సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిన మేడ్చల్ రైల్వే అండర్‌పాస్ వంతెన పనులతో విసిగెత్తిన మేడ్చల్ రాజకీయ నాయకులు వంతెన కిందినుంచి రాకపోకలు కొనసాగించే విధంగా తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అండర్‌పాస్ వంతెన పనులు పూర్తికాకపోవటంతో పట్టణం నుంచి మండలంలోని ఏడు గ్రామాలకు వెళ్లేవారు గౌడవెల్లి గ్రామం మీదుగా వెళ్లాల్సివచ్చేది. గౌడవెల్లి రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ పనులు ప్రారంభించటంతో ఆ మార్గాన్ని మూసివేశారు. దీంతో స్థానికుల ఇబ్బందులు రెట్టింపయ్యాయి. ఫలితంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటుచేసి ప్రజల కష్టాలు తీర్చడమే ఏకైక మార్గంగా భావించిన మేడ్చల్ నేతలు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అండర్‌పాస్ వంతెన కింది నుంచి గురువారం నుంచి తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేశారు. రాయిలాపూర్, గిర్మాపూర్ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులతో పాటు మేడ్చల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్లు లావణ్య హనుమంత్‌రెడ్డి, శివకుమార్ యాదవ్‌లు వాహనాలు రాకపోకలు జరిగే విధంగా టిప్పర్లతో వంతెన కింద మట్టిని పోయించారు. గతేడాది రైల్వే కట్టకు అవతలివైపు ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ జాతర సందర్భంగా చైర్‌పర్సన్ దీపిక ప్రత్యేక చొరవ తీసుకుని అండర్‌పాస్ కింద నుంచి రాకపోకలు కొనసాగే విధంగా తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటుచేశారు. గత వర్షాకాలంలో భారీవర్షాల కారణంగా వర్షపునీరు అండర్‌పాస్ వంతెనలో చేరి నాలుగు నెలలుగా ఆ కాస్త తాత్కాలిక బాట పూర్తిగా మూతపడింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు గౌడవెల్లి మార్గమూ మూతపడటంతో వంతెన కింది నుంచి తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటుచేసి కార్లు, బైక్‌లు, పాదచారులు రాకపోకలు కొనసాగించే విధంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు.


మేడ్చల్ రైల్వే అండర్‌పాస్ వద్ద పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి

పంచాయతీల్లో టీవీలు మాయం


గ్రామ పంచాయతీలో ఎంపీ రంజిత్‌రెడ్డి పంపిణీ చేసిన టీవీ

మర్పల్లి, ఫిబ్రవరి 8: కరోనా విజృంభిస్తున్న తరుణంలో విద్యా సంస్థలు మూతపడటంతో విద్యార్థులు చదువుకు దూరంగా కాకూడదనే ఉద్దేశంతో ఆన్‌లైన్ క్లాసులను కొనసాగింది. కొన్ని గ్రామాల్లో టీవీలు లేని కుటుంబాలు ఉండటంతో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మర్పల్లి మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు ఎల్‌ఈడీ టీవీలను అప్పట్లో పంపిణీ చేశారు. నామమాత్రంగా కొన్ని రోజులు ఆన్‌లైన్ తరగతులు కొనసాగించి లాక్‌డౌన్ ఎత్తేయడంతో ఆ టీవీలు మూలనపడ్డాయి. కొంత కాలం కిందట కొంత మంది ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ టీవీలను ఇతర ప్రాంతాలకు తరలించగా ఇటీవల సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో కొన్ని గ్రామ పంచాయతీల్లో మిగిలిన టీవీలను సైతం మాయం చేశారు. గ్రామస్తులు పంచాయతీల్లో టీవీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తే సంబంధిత పంచాయతీ అధికారులు సమాధానమివ్వడంలేదు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఆస్తులపై అధికారుల తీరు సరికాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీల్లో టీవీలను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామపంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

తాండూరు, ఫిబ్రవరి 8: మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని వైద్య, ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, శానిటేషన్, సెక్యూరిటీ పేషంట్ కేర్ ఉద్యోగులకు గురువారం తాండూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రతీనెల ఏజెన్సీలు వేతనం ఇవ్వాలని నిబంధన ఉన్నా నిబంధనను పాటించడంలేదని వారు వాపోయారు. నిరసన అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ మూర్తికి వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దు


సిబ్బంది స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల బస్తా

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 8: ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని పోచారం మున్సిపల్ చైర్మన్ వేమన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గురువారం ఆయన సిబ్బందితో కలిసి ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేదం ఉన్నందున్న కవర్లకు బదులు నార లేదా వస్త్రంతో తయారు చేసిన సంచులను వాడాలని ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి తమవంతు పాత్ర పోషించాలని కోరారు. అనంతరం ఎస్‌వీడీ వైన్స్‌పై మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక సోదాలు నిర్వహించారు. భారీగా ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తున్న వైన్స్ నిర్వాహకులకు రూ.2వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణికుమారి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సాయితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరులోనే మెడికల్ కళాశాల, ఆస్పత్రి


మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 8 : కందుకూరులోనే మెడికల్ కళాశాల, 420పడకల ఆస్పత్రి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కుట్ర పన్నిందనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికే గత ప్రభుత్వం హడావిడిగా మెడికల్ కాలేజీని మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం సీఎం రేవంత్‌రెడ్డి మెడికల్ కాలేజీతో పాటు ఆస్పత్రిని నిర్మించడానికి సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో భూమి పరిశీలన చేయించారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. మెడికల్ కాలేజీ, ఆస్పత్రి నిర్మాణానికి త్వరలో సీఎం పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

గ్యాస్ కనెక్షన్ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ


ఆన్‌లైన్ నమోదు వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 8 : గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన వివరాలను తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. గురువారం నవాబ్‌పేట్ మండలంలోని నవాబ్‌పేట్, చిట్టిగడ్డ, దాతాపూర్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా పాలన దరఖాస్తులలో గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన డాటాఎంట్రీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ చేసే క్రమంలో డాటాఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్లు పొందే విధంగా డాటా ఎంట్రీని చేయాలని ఆయన సూచించారు. ఆయనతో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, తహసిల్దార్ జయరాం ఎంపీఓ విజయ్ కుమార్‌తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

●జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి

వికారాబాద్, ఫిబ్రవరి 8 : యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదుగాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ అన్నారు. గురువారం వికారాబాద్ లోని స్వాగత్ హోటల్‌లో నిరుద్యోగ యువత కోసం ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ డైరెక్టరేట్ (డీఈటీ), సంకల్ప్ స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్వయంఉపాధి, వేతన ఉపాధి, మహిళలు, యువతకు గల అవకాశాలపై అవగాహన కల్పించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, ట్రైనర్లు వెంకటేష్, శ్రీధర్, ఏపీసీసీ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ దుర్గారెడ్డి, కన్సల్టెంట్ శ్రీనివాస్, యువతి, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్టిఫికేట్లు, కిట్లు అందజేశారు.

అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలు కూల్చిన రెవెన్యూ అధికారులు

శంషాబాద్ రూరల్ 8 : శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామ పరిధిలోని హమీదుల్లానగర్‌లో పలువురు మునిసిపాలిటీ అనుమతి లేకుండా నిర్మించిన పలు నిర్మాణాలను గురువారం తహసీల్దారు నాగమణి, ఆర్ఐ సంజీవ తమ సిబ్బందితో కూల్చివేశారు. ప్రభుత్వ, మునిసిపల్ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని రెవెన్యూ అధికారుల ఆదేశాలను నిర్మాణదారులు పట్టించుకోకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.8 ఏఎమ్ఎల్ 6: పూజలు నిర్వహిస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

మతం కంటే మానవత్వం గొప్పది

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి


ప్రార్థనలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 8 : కులం, మతం కంటే మానవత్వం గొప్పదని, అన్ని మతాల సారాంశం అదేనని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విశ్వాసాలు వేరైన ప్రజలంతా ఒకే కుటుంబంలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జేడీపల్లి హజ్రత్ ఖాజా దర్గాను గురువారం సందర్శించి, ఉర్సు ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సన్మార్గంతో ముందుకు సాగే వారు జీవితంలో ఉన్నతంగా రాణించి ఆనందమయ జీవితాన్ని పొందుతారన్నారు. మాజీ సర్పంచ్ కల్వన కృష్ణయ్య, నాయకులు ఖాజామోయినోద్దీన్, విజయ్ గౌడ్, సుభాష్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్, సతీష్, సుమన్, గణేశ్, పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 8: ప్రకృతిలో సహజ సిద్ధంగా సీజన్‌ను బట్టి చెట్లు చిగురించడం, పుష్పాలు వికసించడం జరుగుతుంది. ప్రస్తుత సీజన్‌లో మోదుగుపూలు వికసించి చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఈ పూలను శివాలయాల్లో పూజలకు ఉపయోగిస్తారు. అదే విధంగా హోళీ పండగకు రసాయనాలు లేకుండా రంగులను తయారు చేసేందుకు మోదుగుపువ్వులను ఉపయోగిస్తారు. రైతులు పశువైద్యంలో కూడా వినియోగిస్తుంటారు.

జాడలేని భగీరథ నీరు!

●కొన్ని కాలనీలకు నల్లా కనెక్షన్‌లు, నీటి సరఫరానే లేదు

●ఇబ్బందులు పడుతున్న కొత్త కాలనీల వాసులు

●పట్టించుకోని మునిసిపల్, మిషన్‌భగీరథ అధికారులు

పరిగి, ఫిబ్రవరి 8 : మునిసిపల్ పరిధిలో నీటిసరఫరా అస్తవ్యస్తంగా మారింది. మిషన్‌భగీరథ అధికారుల ఇష్టారాజ్యం, మునిసిపల్ అధికారుల అలసత్వం కారణంగా నీటికోసం పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం ఏటేటా విస్తరిస్తూ కొత్తగా కాలనీలు వెలుస్తున్నాయి. కానీ అందుకు అనుగుణంగా నీటి సరఫరా జరుగడం లేదు. పలు కాలనీలకు అసలు నల్లా పైప్‌లైన్, కనెక్షన్లే లేవు. పట్టణంలో ఎక్కువగా వ్యక్తిగత బోర్ల ద్వారా నీటి వినియోగం జరుగుతున్నప్పటికీ, బోర్లలో నీరు తగ్గినప్పుడు వారి అవస్థలు చెప్పుకోలేనివి. అధికారులు, పాలకులకు ముందుచూపులేని కారణంగా నీటి సమస్య తలెత్తుతున్నది. మునిసిపల్ అధికారుల అలసత్వం వల్ల అనేక కాలనీల్లో నీళ్లు వృథాగా పోతుండగా మరికొన్ని కాలనీల్లో అసలు నీటివసతే లేకపోవడం వల్ల ఆయా కాలనీల్లో వ్యక్తిగత బోర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. మునిసిపల్ పరిధిలో ప్రస్తుతం సుమారు 26 వేల జనాభా ఉంటుంది. ఈ లెక్కల ప్రకారం ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల చొప్పున 35.10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం రోజుకు 18 లక్షల లీటర్ల నీటిని మాత్రమే మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. సగటు వ్యక్తికి 80 లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం మిషన్ భగీరథ నీరు సగం మాత్రమే సరఫరా అవుతోంది. పలుకాలనీల్లో అసలు నీటి జాడ లేకపోగా, నల్లాలు ఉన్న కాలనీల్లో నీరు వృథాగా పోతున్నదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నీటివసతి లేని కాలనీలు

మునిసిపల్ పరిధిలో నీటి సరఫరా అసలే లేని కాలనీలు చాలానే ఉన్నాయి. తిరుమల రెసిడెన్సీ, భవానినగర్, అనంతనగర్, మైత్రీనగర్, అనురాగ్‌కాలనీ, అనంతంకాలనీ, వెంకటేశ్వరకాలనీ, శ్రీనివాసకాలనీ, పట్టణ శివారులోని అన్ని కాలనీలు, సుల్తాన్‌నగర్‌వెళ్ళే దారిలోని కాలనీలకు నీటి సరఫరా కోసం పైపులైన్లు కూడా లేవు. ఈ కాలనీల్లో నీటి సరఫరా అసలు జరుగడం లేదు. ఈ కాలనీల్లోని ప్రజలంతా వ్యక్తిగత బోర్ల ద్వారానే కాలం గడుపుతున్నారు. మునిసిపాలిటీకి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నా, నీటి వసతిని కల్పించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొత్తకాలనీల్లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పలుకాలనీల్లో నీరంతా వృథా..

నల్లా కనెక్షన్లు ఉన్నచోట్ల పైపులైన్‌లు దెబ్బతినడం వల్ల, మరికొన్ని చోట్ల ట్యాంకులు నిండి నీరంతా వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పలుకాలనీల్లో నీళ్లు సరిపోయిన తర్వాత పైపులను మురికికాలువల్లోకి వదులుతున్నారు. సిద్ధాంతికాలనీ, విజయ్‌నగర్‌కాలనీ, శ్రీనివాస్‌నగర్‌కాలనీ, కొడంగల్ చౌరస్తాలో మిషన్‌భగీరథ నీరు వృథాగా పోతున్నది. అధికారుల తీరు వల్ల నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నల్లా కనెక్షన్ కోసం రెండేళ్ళుగా తిరుగుతున్నా



నల్లా కనెక్షన్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కనెక్షన్ కోసం రూ.6500 అడిగారు. కడతామనిచెప్పినా కనెక్షన్ ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడంలేదు.

-శివారెడ్డి, అనంతనగర్‌కాలనీ, పరిగి

కొత్తకాలనీలకు నీటిసరఫరా లేదు



తిరుమల రెసిడెన్సీకాలనీలో ఇళ్లు నిర్మించుకుని మూడేళ్ళు గడిచిపోయినా ఇప్పటి వరకు మునిసిపల్ నుంచి పైపులైన్ కూడా వేయలేదు. వ్యక్తిగత బోర్లతోనే కాలం గడపుతున్నాం. అధికారులు స్పందించి కొత్తగా వాటర్ ట్యాంకు, పైపులైన్ వేయాలి.

-నాగేశ్, తిరుమల రెసిడెన్సీ,పరిగి


నీటి సరఫరా లేని తిరుమల రెసిడెన్సీ కాలనీ

భగీరథ నల్లా కనెక్షన్‌లు ఇవ్వాలి



మూడేళ్ళ క్రితం ఇల్లు నిర్మించుకున్నాం. వ్యక్తిగత బోరుతో గడుపుతున్నాం. నల్లాకోసం కావాలని అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ తీసుకుని భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వాలి.

-రాజశేఖర్, భవానీనగర్, పరిగి

అన్నికాలనీల్లో నీటిసరఫరాకు చర్యలు



పరిగి మునిసిపల్ జనాభాకు అనుగుణంగా ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల చొప్పున నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్త కాలనీల్లో భగీరథ నల్లా కనెక్షన్‌లకోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. కొత్తగా వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్‌ల కోసం ప్రభుత్వానికి నివేదించాం. కాలనీల్లో కొత్త కనెక్షన్‌లు ఇచ్చేందుకు త్వరలో చర్యలు తీసుకుంటాం.

-ఎం.అశోక్‌కుమార్ మునిసిపల్ చైర్మన్ పరిగి

మల్లారెడ్డి యూనివర్సిటీలో సద్దుమణిగిన ఆందోళన

●యాజమాన్యం, విద్యార్థిసంఘాల నేతల మధ్య చర్చలు



యూనివర్సిటీ యాజమాన్యంతో చర్చలు జరుపుతున్న విద్యార్థిసంఘాల నాయకులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8 : వారం రోజులుగా పురుగుల అన్నం పెడుతున్నారంటూ బుధవారం రాత్రి మల్లారెడ్డి యూనివర్సిటీ బాలికల హాస్టల్ క్యాంటీన్‌లో చేపట్టిన నిరసనను విద్యార్థులు విరమించారు. పలువురు యూనివర్సిటీ అధికారులు క్యాంటీన్ వద్దకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో వారు శాంతించారు. కాగా గురువారం ఉదయం విద్యార్థుల తరఫున నిరసన చేపట్టటానికి యూనివర్సిటీ వద్దకు పలు విద్యార్థి సంఘాల నేతలు చేరుకోవటంతో క్యాంటీన్ నిర్వాహకులు వారితో చర్చలు జరిపారు. వంటచేసే వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థిసంఘాల నేతలు నిరసనను ఉపసంహరించుకున్నారు. కాగా వారం రోజుల పాటు ఎంత మొర పెట్టుకున్నా క్యాంటీన్ నిర్వాహకులు తమగోడును పట్టించుకోలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నంలో, పప్పులో పురుగులు రావటం మామూలుగా మారిందన్నారు. అన్నం తిన్నవిద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని చెప్పినా నిర్వాహకులు పట్టించుకోలేదని పలువురు విద్యార్థులు ఆరోపించారు. ఫుడ్‌పాయిజన్‌తో ఆసుపత్రి పాలయిన విద్యార్థులు చాలా మంది ఉన్నారని, క్యాంటీన్ నిర్వాహణ సక్రమంగా లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించటంతో పాటు క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటిస్తామని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. క్యాంటీన్ నిర్వాహణలో అలసత్వాన్ని సహించబోమని చెప్పారు.

భూములు కోల్పోయే వారికి ఉద్యోగాలు


రైతులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి, ఆర్డీవో

కొడంగల్, ఫిబ్రవరి 8: మెడికల్, నర్సింగ్ కళాశాలలు, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూ సేకరణలో నష్టపోయే రైతులకు వారి అర్హత మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆర్డీవో శ్రీనివాస్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్పాయిపల్లిలోని సర్వే నెం.19లో 75 ఎకరాల భూ సేకరణను ప్రభుత్వం ప్రారంభించింది. అందులో భాగంగా భూములు కోల్పోయే రైతులతో ఆర్డీవో, కడా ప్రత్యేకాధికారి, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు సమీక్షా సమావేశం నిర్వహించారు. కొడంగల్ అభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని వారు కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్వే నెం.19లో అసైన్ పట్టాలు పొందిన రైతులందరూ సహకరిస్తే వారి కుటుంబసభ్యులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రైతులు సానుకూలంగా స్పందించి సహకారం అందిస్తామని తెలిపినట్లు తహసీల్దార్ చెప్పారు. అసైన్డ్ భూములను అభివృద్ధి పనులకు తీసుకోవడం వల్ల ఎవరికి నష్టం వాటిల్లదన్నారు. రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైద్యశాఖలో డిప్యుటేషన్లు రద్దు

●యథాతథ స్థానాలో పనిచేయాలని ఆదేశాలు


రిలీవ్ ఆర్డర్

తాండూరు, ఫిబ్రవరి 8 : వైద్యశాఖలో వివిధ ప్రాంతాల్లో డిప్యుటేషన్‌లపై విధులు నిర్వహిస్తున్నవారు తక్షణమే తమకు పోస్టింగ్ కేటాయించిన ప్రాంతంలోనే పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం (ఫిబ్రవరి 7న)ఉత్తర్వులు జారీ చేసింది. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తూ వివిధ కారణాలతో డిప్యుటేషన్‌పై ఇతర ఆస్పత్రులకు వెళ్ళిన 6గరు వైద్యులు, 10మంది నర్సింగ్ స్టాఫ్, 7గురు పారామెడికల్ సిబ్బంది యథావిధిగా వారి పోస్టింగ్‌ల్లో చేరాలని ప్రభుత్వ ఇచ్చిన ఆదేశాల్లో ఉంది. తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ గా పనిచేసి మెదక్‌జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్ళిన డాక్టర్ మల్లిఖార్జున్ ఇప్పటికే రీజాయినింగ్ కోసం తిరిగి వచ్చారు. ఈ ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫార్మాసిస్ట్‌లు ముగ్గురు, రికార్డ్ అసిస్టెంట్, ల్యాబ్‌టెక్నిషియన్‌లు 5గురు, స్టాఫ్ నర్స్‌లు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఇందులో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా ఉన్నారు. తాండూరు ఆస్పత్రికి చెందిన సివిల్ సర్జన్, హెడ్‌నర్స్‌లు, ఫార్మాసిస్ట్‌లు జాయిన్ అయ్యారు.

యథేచ్ఛగా నాపరాయి తవ్వకాలు

●ప్రభుత్వ భూముల్లో జోరుగా దందా

●రాయల్టీ లేకుండానే రవాణా

●అధికారులనూ లెక్కచేయని అక్రమార్కులు


నాపరాయి లోడ్ కోసం వచ్చిన లారీ(ఫైల్)

బషీరాబాద్, ఫిబ్రవరి 8: ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకున్నానాపరాయి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. లీజుల పేరిట కొందరు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి మరి కొందరు అక్రమంగా సహజ వనరులను దోచేస్తున్నారు. చెరువు శిఖం, ఆర్‌అండ్‌బీ రోడ్లు, రైల్వే పట్టాల పక్కన ఉండే భూములను కబ్జా చేసి అక్రమ త్వకాలు చేపడుతున్నారు. మైన్స్‌లీజులు, రాయల్టీలు లేకుండానే విలువైన నాపరాళ్ల నిక్షేపాలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బషీరాబాద్ మండలంలోని నవాల్గ, కొర్విచెడ్, మాసన్‌పల్లి, క్యాద్గీరా, జీవన్గి, ఎక్మాయి గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో విరివిగా నాపరాళ్ల నిక్షేపాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో పలువురు వ్యాపారులు లీజుల మాటున ప్రభుత్వ సంపదను లూటీ చేస్తున్నారు. కొర్విచెడ్ గ్రామం సమీపంలోని చెరువు శిఖం భూముల్లో అక్రమార్కులు నాపరాళ్ల తవ్వకాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములు, రైల్వేపట్టాల వద్ద పలువురు యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నారు. జీవన్గి ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం పక్కనే నిబంధనలకు విరుద్ధంగా పలువురు నాపరాళ్ల తవ్వకాలు జరుపుతున్నారు. మరికొందరు వ్యాపారులు నాపరాళ్ల తవ్వకాలకు తీసుకున్న లీజు గడువు ముగిసినా యథేచ్ఛగా తవ్వకాలు కొనసాగిస్తూ దొరికినకాడికి దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల అండదండలతోనే ఈ తవ్వకాలు నిరాటంకంగా కొనసాగసాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడే మైన్స్, రెవెన్యూ అధికారులు నాపరాళ్ల గనులపై దాడులు జరుపుతూ ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ తవ్వకాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నాపరాయిని తొవ్వుతున్న దృశ్యం

శిలాఫలకాలు పెట్టారు.. పనులు మరిచారు


శిలాఫలకం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 8 : కొడంగల్ మండలంలో అంగడిరైచూర్ నుంచి ధర్మాపూర్ వరకు, రుద్రారం నుంచి పాటిమీదిపల్లి వరకు బీటీ రోడ్డు వేసేందుకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హడావుడిగా శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసినా ఆ పనులు ప్రారంభం కాలేదు. వెంటనే పనులు ప్రారంభించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ పనుల కోసం సీఆర్ఆర్ నిధులు రూ.2 కోట్ల 70 లక్షలతో బీటీ రోడ్డు పనులను 23-9-2023న శంకుస్థాపన చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా గత ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకాలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8 : న్యాయ వ్యవస్థలో పనిచేసే న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పవన్‌కుమార్, విజయ్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ కోర్టులో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్, విజయ్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు పని వత్తిడి కారణంగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. బీపీ, షుగర్ ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ఉచితవైద్య శిబిరం నిర్వహించిన యశోద ఆసుపత్రి వారికి ధన్యవాదాలు తెలిపారు. పలువురు న్యాయవాదులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో భారత్ వెలిగిపోతోంది

●మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


ప్రసాదాన్ని అందిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

పెద్దేముల్, ఫిబ్రవరి 8 : మోదీ నాయకత్వంలో భారత్ వెలిగిపోతోందని, అన్ని దేశాలు భారత్‌తో సత్సంబంధాలు పెట్టుకోవాలని చూస్తున్నాయని చేవెళ్ళ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గావ్‌చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని తట్టెపల్లి గ్రామంలో గురువారం పర్యటించి గ్రామస్థులతో ముచ్చటించారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అయోధ్య రామమందిరం నుంచి తీసుకువచ్చిన ప్రసాదాన్ని గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ప్రజాప్రతినిధులకు, నాయకులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ 'గావ్ చలో అభియాన్' కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చెప్పారు. మోదీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 4135 కిలోమీటర్ల రోడ్లు వేశారని చెప్పారు. కరోనా సమయంలో పేదదేశాలకు టీకాలను పంపిణీ చేసి అక్కడి ప్రజలను మోదీ ఆదుకున్నారని చెప్పారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్, జిల్లా నాయకులు బంటార్వం భద్వేశ్వర్, మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్, సంగమేశ్వర్, ఉపేందర్ పాల్గొన్నారు.

సేవాభావంతోనే సమాజంలో కీర్తి


పండ్లు అందజేస్తున్న ప్రతినిధులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 8: సేవాభావం, దాతృత్వంతోనే సమాజంలో కీర్తి లభిస్తుందని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ వైద్యుడు డాక్టర్ సి.శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో లయన్స్‌క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మంజుల , లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, కోశాధికారి కొరివి వెంకటయ్య, పీఆర్‌వో ఎం.ఎ పాష, సభ్యులు కర్నాటి కొండల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, బాలకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా

చేవెళ్ల, ఫిబ్రవరి 8 : పలుగుట్ట గ్రామాభివృద్ధికి గ్రామస్థుల సహకారం ఎంతో ఉందని, ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తాజా మాజీ సర్పంచ్ మల్గారి జనార్దన్‌రెడ్డి అన్నారు. పంచాయతీ పాలకవర్గం సభ్యుల పదవికాలం ఇటీవల ముగిసిన సందర్భంగా వారికి గ్రామ ప్రత్యేకాధికారిణి డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో సన్మానం చేశారు. ఈసందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, టీపీసీసీ నాయకుడు జి. శ్రీనివాస్‌గౌడ్, తాజా మాజీ ఉపసర్పంచ్ యాదమ్మరాములు, నాయకులు చల్మారెడ్డి, రామ్‌రెడ్డి, మాజీసర్పంచ్ నర్సింలు, నాయకులు మనోహర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, బాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యస్వామి, శేఖర్‌రెడ్డి, జంగయ్య, యూత్ కార్యదర్శి కార్తీక్‌రెడ్డి, గ్రామస్థులు, వార్డు సభ్యులు ఉన్నారు.


పాలక వర్గం సభ్యులు

అర్హులందరికీ గృహజ్యోతి వర్తింపు

చేవెళ్ల, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం(200యూనిట్లు) అమలుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నారు. గురువారం చేవెళ్లలో ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకన్న, డీఈఈ శివశంకర్, ఏడీఈ స్వామి గృహ వినియోగదారుల మీటర్ నంబర్, ఆధార్/రేషన్ కార్డుల నంబర్లను సేకరించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది గృహజ్యోతి పథకానికి అర్హుల జాబితాను సేకరిస్తున్నామన్నారు. ఈ నెల 15లోగా ప్రక్రియ పూర్తిచేయాలని


చేవెళ్లలో విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న ఎస్ఈ వెంకన్న, సిబ్బంది

ఆదేశాలున్నాయన్నారు. నెలనెలా బిల్ కొట్టేందుకు వచ్చే సిబ్బందికి మీటర్ నంబర్, ఆధార్/రేషన్ కార్డు నంబర్లు ఇవ్వాలని కోరారు. ఒకవేళ ఇళ్ల వద్ద అందుబాటులో లేనివారు ఏఈ కార్యాలయంలో వివరాలు అందజేయాలని సూచించారు. సేకరిస్తున్న ఎప్పటికప్పుడు డేటాను ప్రభుత్వానికి పంపిస్తున్నట్టు చెప్పారు. పేదలందరికీ 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ జానీ మొయినుద్దీన్, లైన్‌మన్ పుల్లయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

షాబాద్: అర్హులైన వారు గృహజ్యోతి పథకానికి వివరాలు నమోదు చేసుకోవాలని షాబాద్ ఏఈ నరేందర్ అన్నారు. మండలంలో నాగర్‌గూడ, తాళ్లపల్లి తదితర గ్రామాల్లో గృహజ్యోతి పథకం కోసం వినియోగదారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న గృహజ్యోతి పథకం కోసం అర్హులైన వినియోగదారులను గుర్తించే పని చేపట్టామన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని, మీటర్ రీడింగ్‌కు వచ్చే సిబ్బందికి బిల్లింగ్ సమయంలో వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ అందజేయాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.


నాగర్‌గూడలో వివరాలను నమోదు చేస్తున్న ఏఈ నరేందర్

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

తలకొండపల్లి, ఫిబ్రవరి 8 : రాంపూర్‌లో సీసీ రోడ్డు పనులను గురువారం మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.5 లక్షలు కేటాయించారు. గ్రామ నాయకులతో కలిసి పనులకు మాజీ సర్పంచ్ శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాకి కృష్ణ, శ్రావణ్ కుమార్‌రెడ్డి, జంగయ్య, శివ, వెంకటేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్యామ్‌సుందర్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో

కందుకూరు, ఫిబ్రవరి 8: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీవో సూరజ్‌కుమార్ కోరారు. గురువారం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 6వ తేదీ వరకు నియోజకవర్గంలో 5,52,085 మంది ఓటర్లుండేవారని, నెల రోజుల పాటు కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేకంగా క్యాంప్‌లు నిర్వహించామన్నారు. కొత్తగా నమోదైన వారితో కలుపుకొని ఓటర్ల సంఖ్య 5,55,976కు చేరిందన్నారు. 80ఏళ్లు దాటిన వారు 7,893మంది, దివ్యాంగులు 8,501 మంది, 18-19 సంవత్సరాల వయస్సు గల కొత్త ఓటర్లు 12,045 మంది ఉన్నారని వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు వచ్చే వరకు ఇప్పుడు కూడా ఆన్‌లైన్‌లో గానీ, లేదా తహసీల్దార్ కార్యాలయాల్లోగానీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం కొత్త ఓటరు లిస్టును విడుదల చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


చౌదరిగూడలో నీటిగుంతను పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 8: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని రకాల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చౌదరిగూడ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. చౌదరిగూడలోని బీసీ కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీ వాసులు ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకురావడంతో గురువారం ఆయన గ్రామంలోని కాలనీలను, పైపులైన్ లీకేజీలను ఎంపీడీవో మహేష్‌బాబుతో కలిసి పరిశీలించారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడారు. కాలనీలో నీటి సమస్యను సరిష్కరించేందుకు పైపులైన్ వేయాలని మిషన్ భగీరథ అధికారులు చెప్పారని ఎంపీడీవో తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఎక్కడా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలని ప్రత్యేకాధికారి పంచాయతీ కార్యదర్శి పాండురంగంకు సూచించారు. అధికారుల వెంట మాజీ ఉపసర్పంచ్ అనిల్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర


విలేకరులతో మాట్లాడుతున్న జగన్, మానయ్య

ఆమనగల్లు, ఫిబ్రవరి 8 : అవినీతి, అక్రమాలు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నాయకులు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్ అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కథ ముగిసిందని, లోక్‌సభ ఎన్నికల అనంతరం ఆ పార్టీ కనుమరుగే అన్నారు. ఆమనగల్లులోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ కాళేశ్వరం పథకంలో అవినీతి వెలుగుచూస్తూ బండారం బయటపడగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేఆర్ఎంబీ పేరుతో కేసీఆర్, వారి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టుల నిర్మాణంలో బీఆర్ఎస్ నాయకులు అందినంత దండుకున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నాయకుల తీరులో మార్పు లేదన్నారు. సమావేశంలో నాయకులు శ్రీశైలం, ఖాదర్, అలీం, రహీమ్, కరీం, శ్రీకాంత్, నాజర్, ఫరీద్, పాల్గొన్నారు.

యాచారం ఇన్‌స్పెక్టర్‌గా శంకర్‌కుమార్

యాచారం, ఫిబ్రవరి 8 : యాచారం పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.శంకర్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ సైదయ్య అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీ అయ్యారు. సైదయ్యకు స్టేషన్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన స్టేషన్ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. శంకర్‌కుమార్ భువనగిరి సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చారు.

'బొక్కల ఫ్యాక్టరీని మూసివేయాలి'

మాడ్గుల, ఫిబ్రవరి 8 : మండలంలోని అప్పారెడ్డిపల్లి శివారు రాజీవ్‌నగర్‌తండా సమీపంలో ఉన్న కోళ్ల వ్యర్థాలు, పశువుల బొక్కలతో నూనె తయారు చేస్తున్న ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని సమీప గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మొదట పశువుల దాణా ఫ్యాక్టరీ అని చెప్పి బొక్కల కంపెనీగా మార్చారన్నారు. రాత్రింబవళ్లు ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన వస్తోందని, తండా వాసులు ఊపిరి తిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా నడుపుతున్న ఈ ఫ్యాక్టరీని మూసివేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామీణులు వాపోతున్నారు. ఈ సమస్యపై తాము కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తండా వాసులు గురువారం పేర్కొన్నారు. బొక్కల ఫ్యాక్టరీ మూయించే వరకు ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఫిర్యాదు చేస్తున్న తండాలోని కొందరిని ఫ్యాక్టరీ యజమాని బెదిరిస్తున్నాడని తండా వాసులు తెలిపారు.

పౌల్ట్రీ రంగానికి శేషయ్య సేవలు అపారం

షాద్‌నగర్, ఫిబ్రవరి 8 : పౌల్ట్రీరంగ పితామహుడు మన్నవ పెద్ద శేషయ్య 3వ వర్ధంతిని పౌల్ట్రీ రైతులు నిర్వహించారు. గురువారం షాద్‌నగర్ శివారు శేషయ్యనగర్‌లోని కమ్యూనిటీ హాలులో ఆయన విగ్రహానికి తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యదర్శి పాతూరి వెంకట్‌రావు, శేషయ్య కుమారుడు రత్నం, పౌల్ట్రీ అధినేత మన్నవ శరత్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, పౌల్ట్రీ రైతులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంకట్‌రావు మాట్లాడుతూ.. పౌల్ట్రీరంగానికి శేషయ్య చేసిన సేవలను అపారమని కొనియాడారు. షాద్‌నగర్ శివారులో 1980లో 120ఎకరాల్లో 100కోళ్ల ఫారాలను ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించారని అన్నారు. శరత్ మాట్లాడుతూ.. తన తండ్రి నీతినిజాయితీతో పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి కృషిచేశారన్నారు. ఆయన ఆశయాల కోసం తాను కూడా తన తండ్రి బాటలోనే నడుస్తున్నానన్నారు. కార్యక్రమంలో పౌల్ట్రీ రైతులు వసంతరావు, సాంబశివరావు, శ్రీనివాస్, మల్లేశ్వరరావు, సతీష్, నాగేశ్వరావు, రాజేంద్రప్రసాద్, రఘు, కృష్ణారావు పాల్గొన్నారు.


శేషయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వెంకట్‌రావు, శరత్

నూతన ఎస్సైకి యూత్ కాంగ్రెస్ సన్మానం

కేశంపేట, ఫిబ్రవరి 8: కేశంపేట పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యత తీసుకున్న కుప్పగిరి లింగాన్ని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం స్టేషన్‌లో ఎస్సైని కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆమెర్, అఖిల్, అజహర్, సిరాజ్, జాకీర్, హరీష్ పాల్గొన్నారు.



'గావ్ చలో అభియాన్‌తో బీజేపీ మరింత బలోపేతం'

కేశంపేట, ఫిబ్రవరి 8:గావ్ చలో అభియాన్‌తో బీజేపీ సంస్థగతంగా మరింత బలోపేతం అవుతుందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రొల్లు రాఘురాంగౌడ్ అన్నారు. కేశంపేటలో గురువారం గావ్ చలో నిర్వహించారు. గోడలమీద బీజేపీ గుర్తుతో పెయింటింగ్ వేశారు. పార్టీకి ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శివాజీ, లింగయ్య, హరికృష్ణ, మల్లేష్, రాఘవేంద్రచారి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి


సమావేశంలో పాల్గొన్న సేవాలాల్ మహరాజ్ సంఘం నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 8: ఈ నెల 15న సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాంరాథోడ్, ఉపాధ్యక్షుడు భీంలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం కందుకూరులో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం వారు మాట్లాడారు. 15న మండల స్థాయిలో నిర్వహించనున్న సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు అన్ని గిరిజన తండాల నాయకులు పాల్గొనాలని కోరారు. గిరిజన సంక్షేమం కోసం రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడాలని ఈ సందర్భంగా విత కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.రాజునాయక్, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బాణావత్ బాలునాయక్, మోహన్‌నాయక్, రవినాయక్, భాస్కర్‌నాయక్, బన్సీలాల్‌నాయక్, వి. శ్రీనునాయక్, నరేందర్‌నాయక్, భజ్జునాయక్, రమేష్‌నాయక్, ఉపేందర్‌నాయక్, చత్రునాయక్, మల్లేష్‌నాయక్, బిక్కునాయక్, చత్రునాయక్, జగన్‌నాయక్, దేవిసింఘ్‌నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకకు హాజరైన క్యాంప్‌లోని బిహార్ ఎమ్మెల్యేలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 8: ఇబ్రహీంపట్నం పరిధి కాగజ్‌గట్ సిరి నేచర్ వ్యాలీలో క్యాంప్‌లో ఉన్న బిహార్ ఎమ్మెల్యేలు బుధవారం రాత్రి మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో జరిగిన ఎమ్మెల్యే బంధువుల పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్నారు. ఈ వేడుకకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు బిహార్ ఎమ్మెల్యేలతో మాట్లా డి వారుంటున్న గెస్ట్‌హౌస్‌లో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.


దీపాదాస్ మున్షీతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బిహార్ ఎమ్మెల్యేలు

ధర్మసాగర్‌ను పంచాయతీగా ఏర్పాటు చేయాలి


భీం భరత్‌కు వినతిపత్రం ఇస్తున్న ధర్మసాగర్ గ్రామస్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 8: మండల పరిధి ధర్మసాగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గురువారం గ్రామస్తులు చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి పి.భీం భరత్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీంతో గ్రామస్తులతో కలిసి భీంభరత్ ఎంపీడీవో హమబిందుకు విన్నవించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ధర్మసాగర్‌ను గొల్లపల్లి పంచాయతీ నుంచి వేరుచేసి సొంత పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. భీంభరత్ మాట్లాడుతూ... ధర్మసాగర్ పంచాయతీగా ఏర్పాటయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంచంద్రారెడ్డి, జంగారెడ్డి, మోహనచారి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఆనంద్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

చాలీచాలని జీతాలతో ఫిజికల్ డైరెక్టర్ల ఇబ్బందులు



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 8 : చాలీచాలని జీతాలతో ఫిజికల్ డైరెక్టర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పీఈటీయా తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడా రు. దశాబ్ద కాలం నుంచి తక్కువ జీతాలతో మోడల్ స్కూళ్లలో ఫిజికల్ డైరెక్టర్లు పనిచేస్తున్నారని, మినిమం టైమ్ స్కేల్ లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, పీడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని చెప్పారు. సమావేశంలో టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయకుమార్, డాక్టర్ కిషోర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొందుర్గు, ఫిబ్రవరి 8: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా రైతులకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం టేకులపల్లిలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామంలో లోవోల్టేజీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకుపోగా ఆయన స్పందించి టేకులపల్లికి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించడం సంతోషకరం ఆయన అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, లైన్‌మన్ రాజు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


నూతన టాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

14 నుంచి శెట్టిపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు ఫిబ్రవరి 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మండలంలోని శెట్టిపల్లి అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆమనగల్లు, యాచారం, ఇబ్రాహీంపట్నం, కందుకూరు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల నుంచి వేలాదిగా భక్తులు రానున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం మాజీ సర్పంచ్ గోదాదేవిసత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, ట్రస్టీ జగన్మోహన్, అర్చకులు నవీన్‌శర్మ, కృష్ణమాచార్యులు పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని గోదాదేవి సూచించారు. బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. 14న గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పండితులు తెలిపారు.

మురుగు కాలువలు శుభ్రంచేసిన సిబ్బంది


నందివనపర్తిలో డ్రెయిన్ శుభ్రం చేస్తున్న కార్మికులు

యాచారం, ఫిబ్రవరి 8 : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ సిబ్బంది గురువారం పారిశుధ్య అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పంచాయతీ కార్మికులు వార్డుల్లో మురుగు కాలువల్లో పేరుకున్న పూడికను తొలగించారు. వీధుల్లో చెత్త వేయొద్దని, తడి చెత్తపొడి చెత్తను వేర్వేరు డస్ట్‌బిన్లలో వేయాలని కోరారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది, కార్మికులు మొక్కలు నాటారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటారు. నీరు పోశారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

కడ్తాల్, ఫిబ్రవరి 8: ప్రజా భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం అని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. ప్రజాపర్యవేక్షణ ఉంటేనే పనులు నాణ్యతగా, వేగంగా జరుగుతాయని అన్నారు. పల్లె చెలుక తండా, గోవిందాయిపల్లిలో పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలతో చేపట్టే అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం పనులను గురువారం ఎంపీటీసీ రాములు, నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. చరికొండ పాఠశాలను సందర్శించి భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజాపాలనలో వివక్ష లేకుండా అందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయని కమ్లి అన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేశ్, రవీందర్, సీతారామ్, శ్రీను, నర్సింహ, రాజు, శంకర్, గోపాల్, నరేందర్, సాయిరామ్, మోతీలాల్, శ్రీను పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

క్రాంతికిరణ్‌కు రాష్ట్రస్థాయి సేవా పురస్కారం

కడ్తాల్, ఫిబ్రవరి 8: రావిచేడ్‌కు చెందిన పుట్టపాక వెంకట క్రాంతి కిరణ్‌కు సేవారంగంలో రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. పినాకిని మీడియా ఏటా సేవలందించే వారికి అవార్డులు ఇస్తోంది. సేవా రంగంలో క్రాంతి కిరణ్‌కు అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పినాకిని మీడియా ప్రతినిధులు, ఆకెళ్ల రాఘవేందర్, కప్పెర ప్రసాద్, శశిధర్, శిల్ప దీది, రుద్రవీణ, వంశీ, ప్రమోద్ క్రాంతి కిరణ్‌కు అవార్డు అందజేశారు. రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న క్రాంతి కిరణ్‌ను పలువురు అభినందించారు.



క్రైం కార్నర్

మోపెడ్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

షాబాద్, ఫిబ్రవరి 8: మోపెడ్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సైన్‌బోర్డుకు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. సంకెపల్లిగూడకు చెందిన చించేటి రంగయ్య(51) తన మోపెడ్ (టీవీఎస్ ఎక్సెల్)పై నాగర్‌గూడ వైపు వెళ్తుండగా మల్లారెడ్డిగూడ స్టేజి సమీపంలో సూచికదిశ బోర్డుకు ఢీకొని గాయపడ్డాడు. స్థానికులు అతడిని చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. రంగయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడి భార్య గోపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

టీ దుకాణంలో చోరీ

చేవెళ్ల, ఫిబ్రవరి 8: మూసి ఉన్న టీ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన చేవెళ్లలో బుధవారం రాత్ర చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లలోని పోలీస్‌స్టేషన్ పక్కన కొంతకాలంగా జగన్ అనే వ్యక్తి టీ స్టాల్ ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం రాత్రి షాపును మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి కృష్ణ అనే వ్యక్తి టీ షాప్‌కు వచ్చి తాళం పగులగొట్టి గల్లపెట్టెలో గల రూ.50వేలు, షాపులోని సిగరెట్లు, కొంత సామగ్రిని ఎత్తుకపోయాడు. గురువారం ఉదయం జగన్ షాపుకొచ్చి చోరీ విషయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చుట్టుపక్కల సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించి రోజూ సిగరెట్ల కోసం వచ్చే కృష్ణ అనే వ్యక్తే చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. జగన్ ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేశారు. కాగా పోలీసులు రాత్రిళ్లు గస్తీని ముమ్మరం చేసి చోరీలను అరికట్టాలని స్థానిక వ్యాపారులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలి

రంగారెడ్డి అర్బన్, జనవరి 8 : ఈ నెల 10న ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏవీ.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని చిన్నచూపు చూడటం మానవవనరులను తగ్గించడమేనన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ పేర్కొన్నా ప్రభుత్వాలు ఎన్నడూ ఆ మేరకు నిధులు కేటాయించలేదన్నారు. కనీసం 20శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని వారు కోరారు.

ఘనంగా షబ్-ఎ-మెరాజ్ వేడుకలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 8 : షబ్-ఎ-మెరాజ్ వేడుకలు ఆమనగల్లులో గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రాత్రి మజీద్‌లలో ప్రార్థనలు, జాగరణ నిర్వహించారు. అనంతరం మౌలానా అబ్దుల్ వాహెద్ ఆధ్వర్యంలో దువ్వా కార్యక్రమాలు చేపట్టారు. జామా మజీద్‌లో నిర్వహించిన వేడుకల్లో ముస్లింలు పాల్గొన్నారు.


మజీద్‌లో ప్రార్థనలు

సంక్షిప్తంగా...

- **తలకొండపల్లి:** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి మాజీ ఎంపీ మల్లు రవి, మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలకు కాంగ్రెస్ టికెట్లు కేటాయించాలని ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రవి, వంశీలకు ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు ఉందని, వారిని నిలిపితే భారీ మెజార్టీతో గెలిపిస్తామని వారన్నారు. తలకొండపల్లిలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. లోక్‌సభ అభ్యర్థుల విషయ ంలో కాంగ్రెస్ అధిష్ఠానం సరైన నిర్ణయం తీసుకొని ప్రజాభిమానం కలిగిన నేతలకే టికెట్లు కేటాయించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
- **మాడ్గుల:** నల్లచెర్వులోని దర్గా వద్ద భారీ సంఖ్యలో భక్తులు ప్రార్థనుల చేసి మొక్కులు తీర్చుకున్నారు. కందూర్ వంటకాలు చేసుకొని ఆరగించారు. దర్గా చెరువు కింద ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది అవుతోందని, ఇక్కడి నుంచి గుట్ట సమీపాన దర్గా నిర్మిస్తామని ఖాదర్ తెలిపారు. ఉప సర్పంచ్ మల్లయ్య, తిరుపతిరెడ్డి, లింగయ్యచంద్రయ్య, వెంకటయ్య, అంజయ్య పాల్గొన్నారు.
- **షాద్‌నగర్:** ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అప్రెంటిషిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.తిరుపతిరెడ్డి తెలిపారు. ఐటీఐ పాస్ అయిన విద్యార్థుల కోసం ఈ నెల 12న ఉదయం 10గంటలకు మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.
- **షాద్‌నగర్:** షాద్‌నగర్ బస్ డిపోలో ఉన్న కార్గో పార్సల్ వస్తువులను వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ ఉష గురువారం తెలిపారు. డిపోలో కార్గో పార్సిల్ వస్తువులు ఎవరూ తీసుకపోకపోవడంతో కొన్ని ఆర్టీసీ ఆధీనంలోనే ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. చాలా రోజులుగా ఎదురు చూసినా ఆర్డర్ చేసిన వారు రాకపోవడంతో ఈ నెల 13న ఉదయం వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు షాద్‌నగర్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్‌ను 9154298615 అనే నంబర్‌లో సంప్రదించాలని డీఎం సూచించారు.

దేవునిపడకల్ పాఠశాలకు ఫర్నిచర్ విరాళం

తలకొండపల్లి, ఫిబ్రవరి 8: పాఠశాలల్లో వసతులు కల్పనకు పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, ఎంపీటీసీ రమేశ్, మాజీ సర్పంచ్‌లు శంకర్, శ్రీశైలం కోరారు. దేవునిపడకల్ పాఠశాలకు పాఠశాల చైర్మన్ లక్ష్మయ్య, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి కుర్చీలు, టేబుళ్ల సమకూర్చారు. గురువారం వాటిని హెచ్ఎం కవిత, టీచర్లకు నాయకులతో కలిసి అందజేశారు. స్వామిగౌడ్, యాదయ్యగౌడ్, సాయిరామ్, మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

